క్లుప్తంగా

ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను సత్కరిస్తున్న సహోపాధ్యాయులు

బొబ్బిలిరూరల్: మండలంలోని పెంట గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుం చి బదిలీ అయిన ఉపాధ్యాయులను హెచ్ఎం ఎం.వేణు గోపాల్ ఆధ్వర్యంలో సహో పాధ్యాయులు బుధవారం ఘనంగా సత్కరించారు. బదిలీ అయిన ఉపాధ్యాయు లు సీహెచ్. రమణ,పి.సత్యనారాయణ, పి.పార్వతి, గోవింద నాయుడు, శ్రీనివాసరా వు, పద్మావతి అందించిన సేవలను హెచ్ఎం కొనియాడారు. విధి నిర్వహణలో అందించే సేవలే సమాజంలో గుర్తింపునిస్తాయని, ఎక్కడైనా సరే అంకిత భావంతో పని చేయాలన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఏఓ అమర శివ



ఈఓ సూరిబాబు

రామభద్రపురం: మండల వ్యవసాయ అధికారి(ఏఓ)గా అమర శివ, రామభద్రపురం మేజర్ పంచాయతీ ఈఓగా పి.సూరిబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ వ్యవ సాయ అధికారిగా పనిచేసిన వెంకటయ్య ఉద్యోగ విరమణ చేయగా, ఆయన స్థానంలో బొబ్బిలి వ్యవసాయ డివిజన్ కార్యాలయంలో సాంకేతిక ఏఓగా పని చేసిన శివ బదిలీపై వచ్చారు. అలాగే రామభద్రపురం మేజర్ పంచాయతీ ఈఓగా పనిచేసిన శ్రీనివాసరావు రాజాం మండలం బదిలీ కాగా, తెర్లాం మండలం నుంచి సూరిబాబు ఇక్కడికి వచ్చారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్

బొబ్బిలి: పట్టణంలోని అన్ని కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఏపీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికిరణ్ యాదవ్ తెలిపారు. బుధవారం స్థానిక రిషి కాలేజ్‌లో మాక్స్‌విజన్ యాజమాన్యం ఆధ్వర్యంలో సుమారు 200 మందికి కంటి పరీక్షలు చేశారు. నెల రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని సాయి కిరణ్ చెప్పారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



చిన్నశిర్లాం గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ ఉపేంద్ర

రేగిడి: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర అన్నారు. మండలంలోని చిన్నశిర్లాం గ్రామం లో ప్రజలకు సైబర్ నేరాలు, మత్తుపదార్థాలతో కలిగే అనర్థాలపై బుధ వారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయ న మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్లకు తెలియని నంబర్ల నుంచి వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దని అన్నారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని, తెలియని వ్యక్తులతో బ్యాంకు ఖాతా, ఏటీఎం కార్డుల వివరాలు పంచుకోవద్దని సూచించారు. యువత, విద్యార్థులు గంజాయి, మద్యం, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వీటికి బానిసగా మారితే జీవితాలు నాశనమవుతాయన్నారు. పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ

బొబ్బిలిరూరల్: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని జగన్నాథపురం సర్పంచ్ బొద్దల పద్మ, స్థానిక నాయకుడు బొద్దల సత్యన్నారాయణ సూచించారు.జగన్నాథపురం గ్రామ సచివాలయంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని, నివాస పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకో వాలని, నిల్వ, జంక్‌ఫుడ్ తీసుకోవద్దని, ఇళ్ల ముందు మురుగు నీరు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఎవరికైనా జ్వర లక్షణాలు ఉంటే వెల్‌నెస్ సెంటర్‌లో వైద్య సిబ్బందిని సంప్రదించాలని చెప్పారు. గ్రామంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఎంపీటీసీ రౌతు తిరుపతిరావు, పంచాయతీ కార్యదర్శి సింహాచలం,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే తప్పదు మూల్యం

- ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు
- నెల రోజుల్లో 10 మందిపై కేసులు నమోదు
- ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున జరిమానా విధించిన కోర్టు
- ప్రమాదాల నియంత్రణకు ఆంక్షలు



కొట్టక్కి పోలీస్ చెక్‌పోస్టు వద్ద డ్రంక్‌అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ వి.ప్రసాదరావు, పోలీస్ సిబ్బంది

రామభద్రపురం: మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరం. మద్యం తాగి వాహనాలు నడపకూడదని పోలీసు యంత్రాంగం ఎంత అవగాహన కల్పిస్తున్నప్పటికీ కొందరికి చెవికి ఎక్కడం లేదు. మద్యం మత్తులో వాహనాలు నడిపే వారి వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) నివేదికలు చెబుతున్నాయి. పోలీసులు ఎన్ని కఠిన ఆంక్షలు అమలు చేస్తున్నా మందు బాబుల్లో మార్పు రావడం లేదు. మద్యం తాగిన మైకంలో వాహనం ఎలా నడుపుతుంటారో వారికే గుర్తు ఉండదు. వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరిగి ఎందరో ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. ఎన్నో కుటుంబాలు ఇంటి పెద్ద దిక్కును కోల్పోతున్నా యి. ప్రమాదాల్లో కొందరు వికలాంగులుగా మారుతున్నారు. నియంత్రణ కోల్పోయి ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొడుతుండడంతో అవతలి వారు తమ ప్రమేయం, తప్పు లేకపోయినా గాయాల పాలుకావడం, ప్రాణాలు కోల్పోవడం జరుగుతోంది. ఈ పరిస్థితికి అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు.వాహనచోదకుల్లో మార్పు తెచ్చేందుకు మండలంలో పోలీసులు ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. రోడ్లపై ఎక్కడ బడితే అక్కడ వాహనాలు ఆపి వాహన చోదకులను బ్రీత్ అనలైజర్‌తో పరీక్షించి,మద్యం తాగినట్లు తేలితే వారిపై కేసులు నమోదు చేసి సాలూరు కోర్టుకు తరలిస్తున్నారు. మండలంలో జూన్ నెలలో సుమారు పది మందిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. వీరికి న్యాయమూర్తి ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు.జరిమానా చెల్లించకుంటే జైలు శిక్ష అనుభవించాలని తీర్పునిచ్చారు.

కఠినంగా వ్యవహరిస్తున్న పోలీసులు..

మద్యం తాగి వాహనం నడిపిన వారి పట్ల పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. మద్యం తాగి రోడ్డెక్కే వాహన చోదకుల లైసెన్సు,వాహనంతో పాటు వాహన పత్రాలను స్వాధీనం చేసుకుంటున్నారు.వాహనంపై ఇద్దరు ఉన్నప్పుడు వాహనం నడిపే వారు మద్యం తాగితే మరో వ్యక్తి మంచి స్థితిలో ఉండి ఉంటే సొంత పూచీకత్తుపై వాహనం అప్పజెబుతారు.ఆపై కోర్టుకు పంపిస్తారు. కోర్టులో జరిమానా లేదా రెండు,మూడు రోజులు జైలు శిక్ష, కొన్నిసార్లు రెండూ అమలు చేసే అవకాశం ఉందని సమాచారం. మద్యం తాగి వాహనం నడుపుతూ రెండో సారి పట్టుబడి కేసు నమోదైతే వాహన ఆర్సీ డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తారు.అలాగే కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైనా తాగి వాహనం నడపవద్దని పోలీసులు,అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



ద్విచక్రవాహన చోదకుడిని బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షిస్తున్న ఎస్ఐ ప్రసాదరావ

విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాం..

మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉంది. వచ్చీరాని డ్రైవింగ్‌తో రోడ్లపైకి రావడం,మైనర్లు వాహనాలు నడపడం,మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.అందుకే విస్తృతంగా వాహన తనిఖీలు చేస్తున్నాం. తాగి పట్టుబడితే కేసులు నమోదు చేసి,కోర్టులో హాజరుపరుస్తున్నాం. ఎవరైనా సరే నింబధనలు పాటించకపోతే చట్టపరమైన చర్యలు తప్పవు.
– కె.నారాయణరావు, బొబ్బిలి రూరల్ సీఐ

ప్రభుత్వ భూమిలో కోళ్లఫారం..!



సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

మెంటాడ: మండలంలోని జయతి పంచాయతీ పరిధి బిరసాడవలస గ్రామంలో విజయపౌల్ట్రీ వారు సుమారు 2.9 ఎకరాల భూమిని ఆక్రమించి కోళ్లఫారం ఏర్పాటు చేసినట్టు రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఆక్రమణలపై కొందరు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ అరుణకుమారి ఆదేశాలతో మండల సర్వేయర్ జ్యోతి, వీఆర్‌ఓఓ అప్పలనాయుడు, సర్వేయర్ సన్యాసిరావు బుధవారం సర్వే చేసి, ఆక్రమణలను నిర్ధారించారు. రెవెన్యూ సిబ్బంది కోళ్లఫారం యాజమాన్యానికి నోటీసులు అందజేశారు. త్వరలో ఇరిగేషన్ అధికారులు కూడా సర్వే చేయనున్నారని రెవెన్యూ సిబ్బంది తెలిపారు.

కలెక్టర్ ఆదేశాలు..

కోళ్లఫారం యాజమాన్యం చేసిన భూఆక్రమణపై, కోళ్లఫారం వల్ల బిరసాడవలసతో పాటు సమీప గ్రామాల ప్రజలకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని విచారణ చేపట్టాలని పశుసంవర్ధకశాఖకు జిల్లా కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారని తహసీల్దార్ అరుణకుమారి తెలిపారు. ఈ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారని చెప్పారు.

రేషన్ పంపిణీలో విఫలం



మాట్లాడుతున్న శ్రీనివాసరావు,తదితరులు

రేగిడి: వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు ఆరోపించారు. ఉంగరాడమెట్ట వద్ద బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎండీయూ వాహనాల ద్వారా లబ్ధిదారులకు రేషన్ సరుకులు ఇంటి వద్దే అందేవని, ఆ వ్యవస్థను టీడీపీ కూటమి ప్రభుత్వం రద్దు చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేసిందని మండిపడ్డారు. రేషన్ దుకాణా ల్లో సరుకులు విడిపించుకునేందుకు ప్రజలు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని, కొన్ని గ్రామాల్లో రేషన్ దుకాణాలు లేకపోవడంతో లబ్ధిదారులు పక్క గ్రామాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. వృద్ధులు, దివ్యాంగులు రేషన్ దుకాణాలకు వెళ్లాల్సిన పనిలేదని, వారికి డీలర్లే సరుకులు ఇంటికి తెచ్చి ఇస్తారని సీఎం చంద్రబాబునాయుడు చెబు తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఎక్కడా అమలు కావడం లేదన్నారు. ఒక రేషన్ డిపో పరిధిలో ఎక్కువ గ్రామాలు ఉన్నప్పుడు డీలర్లు ఆయా గ్రామాల్లోని వృద్ధులు, దివ్యాం గుల ఇళ్లకు వెళ్లి సరుకులు ఏ విధంగా పంపిణీ చేయగలరని ప్రశ్నించారు. ఇంటింటికీ రేషన్ సరుకులు సరఫరా చేయాలంటే డీలర్లకు వాహనాలు సమకూర్చాల్సి ఉంటుందన్నా రు. ప్రభుత్వ నిర్ణయంతో డీలర్లకు వేధింపులు, ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ప్రభుత్వం పునరాలోచించి మళ్లీ ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేయాలని కోరారు. గుల్లపాడు సర్పంచ్ వియ్యపు చక్రపాణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ముంజేటి కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రాంబాబు

తెర్లాం: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పంచాయతీ కార్యదర్శు లంతా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ రేగి రాంబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లోని రక్షిత మంచినీటి పథకాలు, బోరుబావు లు, నేలబావుల్లో క్లోరినేషన్, మంచినీటి పథకాల వద్ద పారిశుద్ధ్య పనులు చేయించాలని సూచించారు. అలాగే వీధి కాలువల్లో పేరుకుపోయిన పూడిక, చెత్త తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు,వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సంతోష్‌కుమార్, ఈఓపీఆర్‌డీ నీలిమ, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను రద్దుచేయడం దారుణం



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు

రేగిడి: కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్స్ తీసుకురావడం దారుణమని సీఐటీ యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.శంకరరావు, కె.సురేష్ అన్నారు. మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద సీఐటీయూ నాయకులు, కార్మి కులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ లేబర్ కోడ్స్ వల్ల కార్మికులు తమ హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, డిమాండ్ల సాధన కోసం ఈనెల 9న చేపట్టనున్న దేశావ్యాప్త సమ్మెలో అన్ని సంఘాల్లోని కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ నాయకులు సుజాత, జగన్, రవిశంకర్, నాగేశ్వరరావు, గౌరమ్మ, పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక





జగన్‌మోహన్‌రెడ్డితో శంకరరావు, అచ్యుత్

బాడంగి/ మెంటాడ: వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో బొబ్బిలి, సాలూరు నియోజకవర్గ యువజన విభాగాల అధ్యక్షులు బేతనపల్లి శంకరరావు, పొట్టంగి అచ్యుత్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తాడేపల్లిలో నిర్వహించిన పార్టీ యువజన విభాగ విస్తృతస్థాయి సమావేశానికి వీరు హాజరయ్యారు. సమావే శం అనంతరం జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. తమకు యువజన విభాగం అధ్యక్ష బాధ్యతలు అప్ప గించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషిచేయాలని వారికి జగన్‌మోహన్ రెడ్డి దిశానిర్దేశం చేశారు.

బెదిరింపులతో పోరాటం ఆగదు



నినాదాలు చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

రాజాం సిటీ: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల పోరాటాన్ని బెదిరింపులతో ఆపలేరని కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షుడు సీహెచ్.రామ్మూర్తి నాయుడు అన్నారు. సమ్మెలో ఉన్న కార్మికులతో కలిసి స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 57 రోజులుగా కార్మికుల చేస్తున్న సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం కుట్రపన్నడం హేయమైనచర్యని అన్నారు. కార్మికులు విధుల్లోకి హాజరుకావాలని బెదిరిస్తూ నోటీసులు ఇవ్వడం చాలా దురదృష్టకర మన్నారు. నోటీసులు ఇచ్చినంత మాత్రాన విధుల్లోకి హాజరుకాబోమని, తమ సమస్యలు పరిష్కరించేవరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. పట్టణ ప్రజలు తాగునీరు, విద్యుత్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం మొండిపట్టుదలకు పోకుండా ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. వేతనాల పెంపుతోపాటు ప్రభుత్వం అమలు చేసే అన్ని సంక్షేమ పథకాలు కార్మికులకు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు హరిబాబు, అనిల్, గణపతి, కృష్ణ, దాస్, శారద, భాస్కరరావు, నర్సింగరావు, రామకృష్ణ, మోహన్, రాజు, ప్రసన్న, లక్ష్మి, ఆశాలత, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు సమ్మె చేస్తున్న కార్మికులకు విధుల్లోకి హాజరు కావాలంటూ నోటీసులు జారీచేశారు.

ఈనెల 9న సార్వత్రిక సమ్మె



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మెప్మా ఆర్పీలు

రాజాం సిటీ: ఈనెల 9న చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మికులంతా జయప్రదం చేయాల ని కార్మిక సంఘాల ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి సీహెచ్.రామ్మూర్తినాయుడు కోరారు. మెప్మా ఆర్పీల తో కలిసి మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడుకు బుధవారం సమ్మె నోటీస్, డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ ఆర్పీలకు కనీసవేతనం అమలు చేసి ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు. మెప్మా ఆర్పీల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆదిలక్ష్మి, ధనలక్ష్మి, స్వాతి, సునీత, నాగరత్నం, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

వంగర: ప్రతి ఒక్కరూ పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి సూచించారు. మండలం లోని కింజంగి గ్రామంలో పారిశుద్ధ్య పనులను బుధవారం ఆయన పరిశీలించారు. చెత్త సేకరణ, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలించడం, కేంద్రంలో సేంద్రియ ఎరువు తయారీపై గ్రీన్ అంబాసిడర్లకు పలు సూచనలు చేశారు. చెత్తను ఆరుబయ ట, కాలువల్లో పారబోయకుండా ఇళ్ల వద్దకు వచ్చే గ్రీన్ అంబాసిడర్లకు అందిం చాలని మహిళలకు సూచించారు. అనంతరం సిబ్బందితో రక్షిత మంచినీటి పథకంలో క్లోరినేషన్ చేయించారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ కెల్ల రామారావు, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

రెడ్‌క్రాస్ బ్రాంచ్ ఏర్పాటుపై 21న సమావేశం

బొబ్బిలి: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సబ్‌డిస్ట్రిక్ట్ బ్రాంచ్‌ను బొబ్బిలిలో ఏర్పాటు చేసేందుకు ఈనెల 21న సమావేశం నిర్వహిస్తున్నట్టు సొసైటీ బొబ్బిలి చైర్మన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈనెల 21న మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే సమావేశానికి బొబ్బిలి పేట్రన్స్, వైస్ పేట్రన్స్, శాశ్వత సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

ఎస్‌డబ్ల్యూపీసీల పరిశీలన



ఫొటో : 02ఆర్‌జెయం43 కొఠారిపురం ఎస్‌డబ్ల్యూపీసీలో సేంద్రియ ఎరువును పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం: మండలంలోని పొగిరి, వి.ఆర్.అగ్రహారం, బొద్దాం, కొఠారిపురం, పెనుబాక తదితర గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను(ఎస్‌డబ్ల్యూపీసీ) ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. గ్రామాల్లో ఇళ్ల నుంచి చెత్త సేకరణ, ఎస్‌డబ్ల్యూపీసీల్లో తడి, పొడిచెత్తను వేరు చేస్తున్న విధానం, సేంద్రియ ఎరువు తయారీ, తదితర అంశాలపై గ్రీన్ అంబాసిడర్లను ఆరా తీశారు. కేంద్రాల వద్ద కూరగాయల పంటలు సాగుచేయాలని, మొక్కలు నాటాలని గ్రీన్ అంబాసిడర్లకు సూచించారు. ఎంపీడీఓ వెంట ఆయా పంచాయతీల కార్యదర్శులు ఉన్నారు.

సంక్షిప్తంగా...

డ్రెయిన్లు పొంగిపొర్లకుండా చర్యలు



మార్కెట్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి, తదితరులు

బొబ్బిలి: వర్షాకాలంలో పట్టణంలోని డ్రెయిన్లు పొంగిపొర్లకుండా చర్యలు తీసుకోవాలని శానిటరీ సిబ్బందిని మున్సిపల్ కమిషన ర్ ఎల్.రామలక్ష్మి ఆదేశించారు. పట్టణంలోని టీబీఆర్ థియేటర్,మేదరి బంద, రాజానగర్ కాలనీ, మార్కెట్ రోడ్లలో బుధవారం పర్యటించారు.డ్రెయిన్ల ఔట్‌లెట్లు క్లియర్ చేస్తే వర్షపు నీరు సాఫీగా వెళ్తుందన్నారు. కాలువలు, రోడ్లకిరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆమె వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి, తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్యసేవలు



దేవుదల అంగన్‌వాడీ కేంద్రంలో సేవలందిస్తున్న వైద్యసిబ్బంది

రేగిడి: మండలంలోని దేవుదళ, బూరాడ, ఉంగరాడ, చిన్నశిర్లాం, పెద్దశిర్లాం తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు రేగడి పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు.

వర్మీ కంపోస్ట్ పిట్‌లు మంజూరు

రాజాం: ఉపాధి హామీ పథకం ద్వారా వర్మీ కంపోస్ట్ యూనిట్లు మంజూరు చేస్తున్నామని ఉపాధి హామీ పథకం ఇన్‌చార్జ్ ఏపీఓ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని గురవాం, బొద్దాం, శ్యాంపురం తదితర గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. వర్మీ కంపోస్ట్ పిట్‌ల కోసం దరఖాస్తు చేసుకున్న వేతనదారులతో ఆయన మాట్లాడారు. పొలాలు, కల్లాల వద్ద వీటిని ఏర్పాటు చేసుకునేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరుచేస్తున్నామని, స్పష్టం చేశారు. 5 అడుగుల పొడవు వెడల్పులతో వీటిని ఏర్పాటుచేసుకుని, సేంద్రియ ఎరువులు తయారు చేసుకోవాలని సూచించారు. మండలంలో 250 మందికి ఈ యూనిట్లు మంజూరు చేశామని తెలిపారు.

పాఠశాల సందర్శన

రేగిడి: మండలంలోని మజ్జిరాముడుపేట ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ ఎం.వి. ప్రసాదరావు బుధవారం సందర్శించారు. విద్యార్థుల హాజరు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. పిల్లలతో పాఠ్యాంశాలు చదివించి వారి విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. అకడమిక్ క్యాలెండర్ ప్రాప్తికి విద్యార్థులకు బోధన చేయాలని హెచ్ఎం వెంకటరావుకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన వంటకాల ను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

సర్పంచ్‌లకు ముగిసిన శిక్షణ

బొబ్బిలిరూరల్: మహిళా సాధికారిత, సుపరిపాలనపై నియోజకవర్గంలోని మహిళా సర్పంచ్‌లకు స్థానిక వెలుగు కార్యాలయంలో మూడురోజుల పాటు నిర్వహించిన శిక్షణ బుధవారంతో ముగిసింది.శిక్షకులు, పంచాయతీ కార్యదర్శి తులసి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం అందించే నిధులను గ్రామాభివృద్ధికి సక్రమంగా వినియోగించాలని సూచించారు. నిధులకోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం, విడుదలైన నిధులతో ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టడం, ఖర్చులను రికార్డు చేసుకునే విధానాన్ని వివరించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల మహిళా సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నేటి నుంచి మరోమూడు మండలాలకు

గురువారం నుంచి మూడు రోజుల పాటు దత్తిరాజేరు,మెంటాడ,గజపతినగరం మండలాలకు చెందిన మహిళా సర్పంచ్‌లకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి. రవికుమార్ తెలిపారు.

నారుమడుల్లో నీరునిలిచిపోకుండా చూసుకోవాలి

బాడంగి: అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున వరి నారుమడుల్లో నీరు నిలిచిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి(ఏఓ) జి.సూర్యప్రకాష్ రైతులకు సూచించారు. వీరసాగరం గ్రామంలోనిరైతు సేవా కేంద్రంలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహిం చారు. వరి నారుమడుల తయారీ, యాజమాన్యపద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.వరి నారు మడులతో పాటు జొన్న,పత్తి, కూరగాయల పంట పొలాల్లో వర్షం నీరు బయటకు పోయేలా చూసుకోవాలని చెప్పారు.వరి వెదజల్లినవారు వర్షంతగ్గిన వెంటనే ఎరువులు వేసుకోవాలన్నారు. ఏఈఓ,వీఏఏ పాల్గొన్నారు.

గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

బాడంగి: స్థానిక డాక్టర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో 5వతరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఖాళీ సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్టు ప్రిన్సిపాల్ జి.వరప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఇంగ్లిష్ మీడియం బైపీసీ, ఎంపీసీ గ్రూపుల్లో ఖాళీలకు ఈనెల 6,7వ తేదీల్లో, 5వ తర గతిలో సీట్లకు ఈనెల 4,5వ తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తామని పేర్కొన్నారు.ఎస్టీ, ఎస్సీ విద్యార్థులు తమ విద్యార్హత, ఇతర ధ్రువపత్రాలతో నేరుగా గురుకుల పాఠశాల లో హాజరు కావాలని సూచించారు.

మిగులు సీట్లకు దరఖాస్తులాహ్వానం

వంగర: మండల పరిధి మద్దువలస డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులంలో 5వ తరగతిలో మిగులు సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాధిక బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ కేటగిరిలో 30 సీట్లు, ఎస్టీ కేటగిరీలో నాలుగు సీట్లు ఉన్నాయని, అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.